# కల్వరి అద్భుతములు[1]

## మత్తయి 27:45, 46, 50-54; మార్కు 15:33, 37-39; లూకా 23:44-48; యోహాను 19:28, 30, పరిశీలన

ఎవరెస్టు పర్వత ప్రాంతంలో లోకములో బహు ఉన్నతమైన పర్వత శిఖరాలున్న మాట వాస్తవమే అయినా, – ఎవరెస్టు ఎత్తునుబట్టి[2] మనలో ఎక్కువమంది అక్కడున్న తక్కిన పర్వతాలను గురించి వినియుండరు. ఎవరెస్టు యొక్క ఘనత తక్కినవాటిని మరుగుపరుస్తుంది. అలాగే, క్రీస్తు సిలువ చుట్టు అనేకమైన గొప్ప అద్భుతాలు చుట్టుకొని యున్నాయి: సూర్యుడు చీకటి కమ్మడం, గొప్ప భూకంపం కలగడం, దేవాలయపు తెర పైనుండి క్రిందికి చినగడం, మృతులైన పరిశుద్ధుల దేహాలు సమాధులలోనుండి లేవడం జరిగాయి. క్రీస్తు మరణ ప్రాధాన్యతవలన, మనలో ఎక్కువ మందికి అద్భుతమైన ఈ సంభవాలు అంతగా పరిచయం లేకుండా పోయాయి.

ప్రకృతికి అతీతమైన ఈ సంభవాలు "కల్వరియొక్క చిన్నకొండలు"గా సూచింప బడ్డాయి. వాటిని సరిగా గ్రహించినప్పుడు. క్రీస్తు బలిలోని మహత్త్యమును ప్రతి ఒక్కటి ఘనపరుస్తుంది. "నిత్య విమోచన అనే భావంతో" క్రీస్తుయేసు మరణము చుట్టు సూచకక్రియల వరుసగా నిలిచియున్నట్టు విలియం నికోలస్ అన్నాడు.[3] "కల్వరి అద్భుతముల"ను మనం గమనిస్తే, క్రీస్తు మనకొరకు ఏమి చేశారో దానిని అభినందించ డానికి మనలో ప్రతి ఒక్కరికి సహాయపడుతుంది.

## చీకటి: దైవికమైన హెచ్చరిక[4] (మత్తయి 27:45, 46; మార్కు 15:33; లూకా 23:44, 45ఎ)

**ఏమి జరిగింది**

గొల్గొతా దృశ్యాన్ని నీ మనస్సులో చిత్రించుకో. ఉదయం 9 నుండి మధ్యాహ్నంవరకు బాగానే ఉంది. తన శత్రువులకొరకు ప్రార్థించడంలో, తన తల్లిపట్ల బాధ్యతను కనుపరచడంలో, దొంగను రక్షించడంలో, శ్వాస పీల్చుకొనడంలో క్రీస్తు నిమగ్నులయ్యారు. ఆయన శత్రువులు ఆయన వస్త్రములను పంచుకొనడంలో, ఆయన ముఖాన దుమ్మెత్తి పోయడంలో నిమగ్నులయ్యారు, ఆయనకొరకు విలపిస్తున్న స్త్రీలు, ఆయన తల్లిని ఆ

దృశ్యంనుండి తోడుకొనిపోయిన శిష్యులవంటివారు ఆ పనుల్లో తలమునకలయ్యారు. అప్పుడు తటాలున – కార్యకలాపాలు స్తంభించిపోయాయి, ఆ రంగాన చీకటి అలుము కొంది: "అప్పుడు రమారమి మధ్యాహ్నమాయెను. అది మొదలుకొని మూడు గంటలవరకు ఆ దేశమంతటిమీద చీకటి కమ్మెను; సూర్యుడు అదృశ్యుడాయెను" (లూకా 23:44, 45ఎ; మత్తయి 27:45; మార్కు 15:33).[5]

ఈ చీకటిని గూర్చి మనకు తెలియని సంగతి చాలా ఉంది. ఇది ఎంత సంపూర్ణమైనదో మనకు తెలియదు – నరుడు తన సొంత చేతిని చూచుకోలేనంత చీకటియై ఉంటుందని నేననుకొంటాను.[6] అది ఎంత దూరం వ్యాపించిందో కూడా మనకు తెలియదు; అది స్థానికమైయుండవచ్చు, లేదా యూదయను దాటి అది వ్యాపించి యుండవచ్చు. ఆ సృష్టి చర్య అవిశ్వాసులకు సయితం ఎరుకైయుండినట్టును, రోము చరిత్రలోనికి అది దాఖలు చేయబడినట్టును – దైవప్రేరేపితముకాని క్రైస్తవ, క్రైస్తవేతర ఆరంభ రచనలలో సూచింపబడింది.[7]

కనీసం మనకు యిది తెలుసు: చీకటి అనేది ప్రకృతి సిద్ధమైనది కానేరదు. ఇది సూర్య గ్రహణమైయుండినట్టు సందేహవాదులు వివరించపూనారు. కాని పస్కాపండుగ దినాల్లో యూదయలో సూర్య గ్రహణం అసాధ్యం.[8] మేఘమయమైన ఆకాశమని లేక ఇసుక తుఫాను అని వారు చెప్పబూనారు కాని, సువార్త లేఖకులు మాత్రం అలాటి వాటిని అంగీకరించరు. ఆ చీకటి ప్రకృతి అతీతమైనదని చెప్పడానికి పలు కారణాలున్నాయి – వాటిలో దాని సమయం,[9] సిలువ చుట్టునున్నవారిమీద దాని ప్రభావం కూడా చేర్చబడియుంటాయి.[10]

### దాని ఉద్దేశమేమైయుంటుంది

ఆ చీకటి దైవికమైన భయసూచన లేక హెచ్చరికయని నా నమ్మకం: దేవుడు మానవ పన్నాగాలచేత భ్రష్టుడుకాలేదని, ఆయన తన సంకల్పాన్ని నెరవేర్చుకుంటున్నాడనే సూచనయై ఉంది. జనులు ఆకాశమునుండి ఒక సూచన చూడగోరారు (మత్తయి 16:1; మార్కు 8:11; లూకా 11:16); ఎదురు చూడనిదొకటి వారికనుగ్రహింపబడింది. చీకటి బాధకు సూచనయైయుంది: మనకొరకు మృతినొందుటలో క్రీస్తు వేదన అనుభవించవలసివచ్చింది (1 కొరింథీ. 15:3).[11] అది పోరాటమునకు సూచన యైయుంది: క్రీస్తుకును దుష్టశక్తులకును మధ్య జరిగే పోరుయొక్క శిఖరాగ్రమై ఉంది (ఆది. 3:15; లూకా 22:53; హెబ్రీ. 2:14). అది ఎడబాటుకు సూచనయైయుంది: మన పాప ఋణాన్ని చిట్టచివరకు తీర్చడంలో, క్రీస్తు తన తండ్రినుండి సహా ఎడబాటును అనుభవించారు (మత్తయి 27:46).

యుగములలో తరములలో మహా గొప్ప మర్మమైయుండిన దానిపై దేవుడు చీకటియను వలను పరిచాడు: ఒక మనుష్యుడు సమస్త మానవ కోటి పాపముల నిమిత్తం ఎలా మరణించగలిగాడో. క్రీస్తు అనుభవించిన అత్యధికమైన వేదన నిశబ్ద సమయంగా ఉండడం తగినదై ఉంది – ఆయన మన నిమిత్తం ఏమి చేశారో పరిపూర్ణంగా ఎరుగలేని మన అసమర్థత చివరిగా మనలను నోరు మూయించింది.

# భూకంపము: దైవికమైన శక్తి
# (మత్తయి 27:46, 50, 51, 54; లూకా 23:46; యోహాను 19:28, 30)

మూడు గంటలసేపు ఉన్న చీకటి చివరి దశలో, "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి?" అని క్రీస్తు ప్రభువు కేకవేశారు (మత్తయి 27:46). దాని తరువాత త్వరితగతిని మూడు పలుకులు ఆయన పెదవులగుండా వచ్చాయి: "దప్పి గొని యున్నాను" (యోహాను 19:28); "సమాప్తమైనది" (యోహాను 19:30); "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" (లూకా 23:46). "యేసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను" (మత్తయి 27:50). ఆయన అలాగు చేయగా పలు ఆశ్చర్యకరమైన కార్యాలు జరిగాయి.

## ఏమి సంభవించాయి

మొదటిది భూకంపం (మత్తయి 27:54): భూమి కంపించింది (మత్తయి 27:51బి). "స్థిరమైన భూతలం"[12] "స్థిరమైనదైనట్టు" అనిపించినప్పుడు భూకంపం వంటి కొన్ని సంగతులు నిజంగా భయానకమైయుంటాయి. రిక్టర్స్ స్కేలులో,[13] ఈ భూకంపం ఎంత ప్రామాణికంగా దాఖలైయుండిందో నాకు తెలియదు గాని, అది ఎంతటి ఉద్రిక్తంగా ఉందంటే – బండలను సయితం అది బ్రద్దలు చేసింది (మత్తయి 27:51సి) కొండలోనికి తొలిచిన సమాధులను కూడా తెరిచింది. (మత్తయి 27:52ఎ).[14]

భూగర్భంలో ఉన్న ఒత్తిడి అధికమగుట చేత బండలు ఒకదాని ప్రక్కను ఒకటి జరుగుట మాత్రమే ఈ భూకంపం కాదు.[15] ఈ సంభవం యొక్క సమయము, దాని ప్రభావము దేవుని చేతిలో ఉన్నట్టు కన్పిస్తుంది. క్రీస్తు మరణము ఆ భూకంపము (మత్తయి 27:50, 51) దేవాలయపు తెర చినగడం (మత్తయి 27:51), కొందరి సమాధులు తెరవబడడం అనేవి (మత్తయి 27:51, 52) ఒకే సమయంలో సంభవించాయి. వాటిని అనుభవించినవారిపై పడిన ప్రభావం దేవుని ఉద్దేశాన్ని తేటతెల్లం చేస్తుంది (మత్తయి 27:54).

## దాని భావం

భూకంపం దైవిక శక్తిని ప్రదర్శిస్తుంది. సీనాయి కొండమీదనుండి ధర్మశాస్త్ర మియ్యబడినప్పుడు, "ఆ పర్వతమంతయు మిక్కిలి కంపించెను" (నిర్గమ. 19:18). ఇప్పుడు, క్రీస్తు ధర్మశాస్త్రాన్ని నెరవేర్చగా,[16] భూమి మరల కంపించింది. భూకంపము ప్రకృతిమీద దేవుని ప్రభావాన్ని ప్రదర్శిస్తుంది. అయితే అది దానికంటె ఎక్కువను సూచిస్తుంది. మానవ హృదయాన్ని తాకగల ఆయన శక్తినికూడా అది స్థిరపరుస్తుంది: "శతాధిపతియు అతనితో కూడ యేసునకు కావలియున్నవారును, భూకంపమును, జరిగిన కార్యములన్నిటిని చూచి, మిక్కిలి భయపడి – నిజముగా ఈయన దేవుని కుమారుడని

చెప్పుకొనిరి" (మత్తయి 27:54). క్రీస్తు మరణంతో కలసి జరిగిన ఈ సంఘటన, పాపాన్ని నశింపజేయడంలో దేవుని శక్తికి గురుతుగా అది జరిగింది.

## తెర చినిగింది: దైవికమైన ఉద్దేశం

## (మత్తయి 27:50, 51; మార్కు 15:37, 38; లూకా 23:45బి)

**ఏమి సంభవించింది**

మూడవ అద్భుతాన్ని తిలకించడానికి మనం గొల్గొతానుండి దక్షిణంగా పట్టణపు గవునులలో గుండా దేవాలయపు స్థలానికి వెళ్లాలి. క్రీస్తు ప్రభువు తన చివరి కేక వినిపించినప్పుడు భూకంపము ఆ ప్రాంతాన్ని కదిలించివేసింది. అంతకు ముందు ఎన్నడే జరుగనిది దేవాలయంలోపలి భాగంలో జరిగింది: "అప్పుడు దేవాలయపు తెర పై నుండి క్రిందివరకు రెండుగా చినిగెను" (మత్తయి 27:51ఎ; మార్కు 15:38; లూకా 23:45బి లను చూడు[17]).

ఈ వింతైన సంభవము యొక్క ప్రాధాన్యతను గ్రహించడానికి, ఆ సెట్టింగునంతటిని ఆ సంఘటనను వీక్షించవలసి యుంటుంది. క్రీస్తు సాయంకాల ప్రార్థనా సమయంలో, అంటే, సాయంకాలం మూడు గంటల వేళ చనిపోయారు (మత్తయి 27:46; అపో. 3:1 చూడు). ఆ సమయంలో, నమ్మకమైన యూదులు, స్త్రీలేమి పురుషులేమి, ప్రార్థించడానికి స్త్రీల ప్రాంగణంలో కూడుకుంటారు. వారు ప్రార్థించుచుండగా, ధూపము వేయడానికి యాజకుడు దేవాలయంలోనికి వెళ్లతాడు.

ఆ దినాన ధూపం వేయడానికి పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించే భాగ్యముగల యాజకుడవు నీవే అయ్యున్నట్టు కొంచెంసేపు ఊహించుకో. జీవితకాలమంతటిలో నీవు ఈ ఘనతను పొందేది ఒకే ఒక్కసారి.[18] పరిశుద్ధ స్థలములలోనికి ప్రవేశిస్తుండగా నీ నాడి త్వరగా కొట్టుకొంటుంది. అతి పరిశుద్ధ స్థలాన్ని నీకు మరుగుచేసే తెరకు ఎదురుగా ధూపవేదిక నీ ముందర ఉంది.[19] అతి పరిశుద్ధ స్థలమంటే, దాని పేరు సూచించినట్టే, అది భూమిమీద అతి పవిత్రమైన స్థలమని నీవు భావిస్తున్నావు. (ప్రధాన యాజకుడు మాత్రమే, ప్రాయశ్చిత్త దినాన, సంవత్సరానికి ఒక్కసారే అతి పరిశుద్ధ స్థలంలోనికి ప్రవేశిస్తాడు, హెబ్రీ. 9:7; నిర్గమ. 30:10; లేవీ. 16:29–34లను చూడు.)

సువర్ణ ధూపవేదికను నీవు సమీపిస్తుండగా,[20] 30 అడుగులకు 30 అడుగులుండే మహా పెద్ద తెర (9 మీటర్లకు 9 మీటర్లు) నిన్ను ఆకట్టుకొనక మానదు. ప్రత్యక్ష గుడారము కొరకు అలాటి తెరను చేయవలసిందిగా మోషే ఆజ్ఞాపించబడ్డాడు:

> మరియు నీవు నీల ధూమ్ర రక్తవర్ణముగల ఒక అడ్డ తెరను వేసిన సన్న నారతో చేయవలెను. అది చిత్రకారుని పనియైన కెరూబులు గలదిగా చేయవలెను. తుమ్మ కఱ్ఱతో చేయబడి బంగారురేకు పొదిగిన నాలుగు స్తంభములమీద దానిని వేయవలెను; దాని వంకులు బంగారువి వాటి దిమ్మలు వెండివి. ఆ అడ్డతెరను ఆ కొలుకుల క్రింద

తగిలించి సాక్ష్యపు మందసము అడ్డతెరలోపలికి తేవలెను. ఆ అడ్డతెర పరిశుద్ధ స్థలమును అతిపరిశుద్ధ స్థలమును వేరుచేయును (నిర్గమ. 26:31–33).

సొలొమోను దేవాలయాన్ని నిర్మించినప్పుడు, అతడు అలాటి ఆదేశము పొంది యుండవచ్చు. ఎందుకంటె, "అతడు నీలి నూలుతోను ఊదా నూలుతోను ఎఱ్ఱ నూలుతోను సన్నపు నారనూలుతోను ఒక తెరను చేయించి దానిమీద కెరూబులను కుట్టించెను" (2 దినవృ. 3:14). హేరోదు దేవాలయపు తెరకూడ అదే నమూనాను అనుసరించి యుండవచ్చు.[21] పరిశుద్ధ స్థలంలో ప్రవేశించే యాజకునికి ఈ బ్రంహ్మాండమైన తెర ఎలా కన్పించేదో నికోలస్ యిలా వర్ణించాడు:

> అది విచిత్రమైన పనితనంతో చేయబడిన వస్త్రం. ప్రారంభంగా "పేనిన సన్నపు నార" నీలి ధూమ్ర రక్త వర్ణములుగలదిగా నేయబడింది. ఆ మూడు రంగులతో కెరూబు రూపంలోని పదుగు పేకగా నేయబడింది. ఆ తెర జీవము శక్తి అనేవి ఉట్టిపడేలాగునను, అదే సమయంలో, సౌందర్యమును మహిమయు ప్రదర్శింపబడేలా చిత్రించబడింది …
>
> సువర్ణ దీప స్తంభపు కాంతిలో, అది ఎంతటి ఉద్రేకం కలిగించేదానిలో ఉంటుందో![22] దాని వెనుకనున్న అత్యధికమైన మహిమను దాచడానికి అది వ్రేలాడుతున్నందున, అది ఎంతటి భయభక్తిని మనస్సును నింపుతుందో! దానిపై వేయబడిన కెరూబుల శక్తి, మెలకువగా ఉన్న కావలివారి ప్రదర్శనతో చిత్రింపబడిన పనిని బట్టి – "ఇంతవరకే, యిక ముందుకు రావద్దు" అన్నట్టు నిశబ్దంగాను గంభీరంగాను అన్నట్టు ఉంటుంది.[23]

ఆ తెర పైనుండి నీ దృష్టిని మరల్చి నీకు అప్పగింపబడిన పనివైపు తిరిగావు. అగ్నిగల బలిపీఠం మీద ధూపద్రవ్యాన్ని చల్లుతున్నావు. అలా చేస్తున్నప్పుడు, నీ పాదముల క్రింద ఉన్న నేల కంపిస్తుంటే, నీవు నీ మెకాళ్లమీదికి ఒరిగావు.[24] అప్పుడు, అసమానమైన దొకటి సంభవించింది. చినిగిన లేక చించిన శబ్దం నీకు వినిపించింది పైకి తేరి చూచావు, నీ తలపైగా దాదాపు ఇరవై అడుగుల ఎత్తులో తెరలో చిరుగు ప్రారంభమయ్యింది. దిగ్భ్రమచెందిన కన్నులతో నీవు చూచుచుండగా, పైనుండి ఆ చినుగు – దిగి దిగి – సంపూర్ణంగా ఆ తెర రెండు భాగాలుగా విడిపోయింది! అది పరిశుద్ధ స్థలంలో మర్మమైయున్న ఛాయలను నీవు కన్నులారా చూడగలిగావు! నీవు ఎన్నడే మరచిపోలేని దృశ్యాల్లో యిది ఒకటి – నీవు నీ మనుమల తరానికి కూడా తెలుపుతావు!

అద్భుతమైన ఈ సంభవాన్ని వివరణతో త్రోసివేయ జూచారు. "భూకంపంవలన తెర చినిగిందని వారంటారు." అయితే వారి "వివరణ" ఒప్పించడానికి చాలనిదై యుంది. ఉదాహరణకు, లూజుగా వ్రేలాడుతున్న తెరను చింపగలిగినంత శక్తిని కలిగి ఉన్నప్పుడు, అది దేవాలయాన్ని ఎందుకు శిథిలం చేయలేదు? పైగా, జడాలను నాశనం చేయగలిగిన భూకంపం, ఒక చిన్న గుడ్డముక్క మీద ప్రభావం కనుపరచలేదు. "ఆ తెర పాతగిలినదై చెడిపోయి పడిపోడానికి సిద్ధమైన స్థితిలో ఉండియుండవచ్చు" నని అవిశ్వాసులు అంటారు. అలాగైయుంటే, తెర పేలికలు కావలసింది. అయితే అలా జరుగలేదు, దానికి బదులు, "అది రెండుగా చినిగిపోయింది" (లూకా 23:45). గనుక తెర చినిగిపోవడమనేది

ప్రకృతి శక్తుల ప్రభావంవలన జరిగింది కాదు.

మనుష్యులు చేసిన విధ్వంసంవల్ల కూడా తెర చిరుగలేదు. (ఊహింపబడని హేతువువలన) మానవులు దాన్ని చింపియుంటే క్రింద లేక మధ్యలో పట్టుకొని క్రిందినుండి పైకి తెరను చింపే వీలుంటుందిగాని పైనుండి క్రిందికి చింపే వీలుండదు. ఏదియెలాగున్నా, లేఖనం దీన్ని యిలా వివరిస్తుంది: "అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రిందివరకు రెండుగా చినిగెను" (మత్తయి 27:51ఎ). అదృశ్యమైన శక్తులవలన, దేవుని హస్తంవలన అది చింపివేయబడిందనేది ఒకే తీర్మానం మిగిలియుంటుంది.[25]

## దాని భావమేమి

ఈ ఒకానొక్క సంఘటననుండి మనం ఏ పాఠం నేర్చుకోగలం? సిలువకు గల దైవికమైన ఉద్దేశంతో తెర చిరగడం ప్రత్యక్షంగా సంబంధించి ఉంది. మూడు పాఠాలను యిక్కడ ఆలోచన చేద్దాం:

(1) పాత నిబంధన ఏర్పాటు అంతమయ్యిందని తెర చినిగిపోవడం – ప్రకటించింది.[26] తెర చినిగిపోవడం క్రీస్తు మరణ సందర్భంగా జరిగింది, అది క్రొత్తనిబంధన ప్రారంభించడానికి మార్గాన్ని సరళం చేసింది. హెబ్రీ రచయిత యిలా అన్నాడు, "మరణ శాసనమెక్కడ ఉండునో అక్కడ మరణశాసనము వ్రాసినవాని మరణము అవశ్యము. ఆ శాసనము వ్రాసినవాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించుచుండగా అది ఎప్పుడైనను చెల్లునా?'' (హెబ్రీ. 9:16, 17). పాతనిబంధన అంతమయ్యిందని క్రీస్తు మరణం చాటించింది (కొలస్సీ. 2:14) క్రొత్తనిబంధనకు శ్రీకారం చుట్టింది.[27]

(2) తెర చినిగిపోవడంవలన అతిపరిశుద్ధమైన స్థలంలోనికి ఎలా మార్గం తెరువబడిందో, అలాగే ఆయన శరీరమను తెర ద్వారా పరలోకములోని అతిపరిశుద్ధమైన స్థలంలోనికి క్రీస్తు ప్రవేశించారు. అతి పరిశుద్ధ స్థలానికి పరలోకానికి, దేవాలయంలోని భౌతికమైన తెరకు క్రీస్తు ప్రభువు శరీరానికి మధ్య సమాంతరాన్ని హెబ్రీ రచయిత సూచించాడు. తాను యిలా రాశాడు: "సహోదరులారా, … యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవముగలదియు, ఆయన శరీరమను తెరద్వారా ఏర్పరచబడిన మార్గమున …" (హెబ్రీ. 10:19, 20).

(3) తెర చినగడంలో ఉన్న అతి ముఖ్యమైన పాఠం, క్రీస్తు మరణం ద్వారా దేవుడు జనులందరికి మార్గం తెరిచాడు. గతంలో గమనించినట్టే, దేవాలయంలోని అతి పరిశుద్ధమైన స్థలంలోనికి ప్రధాన యాజకుడు ఒక్కడే వెళ్లే అనుమతిగలవాడై ఉండేవాడు. అయితే యిప్పుడే చదివిన లేఖన భాగంనుండి – దైవమానవుల మధ్య ఉన్న అడ్డంకు తొలగింపబడిందని హెబ్రీ రచయిత తేటపరచాడు: "ఆయన [క్రీస్తు] రక్తమువలన పరిశుద్ధ స్థలమునందు [పరలోకమందు] ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది." "దేవుని యింటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను … విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయం కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము" (హెబ్రీ. 10:21, 22ఎ).

దైవ మానవుల మధ్య అడ్డంకు తొలిగింపబడడం మాత్రమేగాక, దేవాలయపు తెర చిరిగి పోవడంతో, “ప్రత్యేకమైన” యాజకులు “సామాన్యులైన” దేవుని ప్రజలు అనే వారిమధ్య కూడా అడ్డంకులు తొలిగించబడ్డాయి (1 పేతురు 2:5, 9లను చూడు). జనుల లేక జనముల మధ్యనున్న ఆటంకాలు సయితం తొలిగింపబడ్డాయని మనం చెప్పవచ్చు (ఎఫెసీ. 2:14-16). తిరిగి “తెరను” దాని స్థానంలో పెట్టకుండ మనం జాగ్రత్తపడదాం![28]

## మృతులు లేపబడ్డారు: దైవికమైన వాగ్దానం (మత్తయి 27:51బి-53)

**ఏమి జరిగింది**

ఇప్పుడు మనం బైబిలులోని బహు అసాధారణమైన అద్భుతానికి వచ్చి చేరుకున్నాం ఇది మాటల పొదుపుతో వర్ణింపబడింది. మత్తయి 27 యిలా చెప్తుతుంది “... భూమి వణకెను; బండలు బద్దలాయెను; సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను వారు సమాధులలోనుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి” (51బి-53 వచనాలు). దీనిని మనం రెండు అద్భుతాలుగా భావించవచ్చు: (1) సమాధులు తెరవబడడం (2) మృతులు లేపబడడం. సమాధులు దాదాపుగా శుక్రవారం సాయంత్రం జరిగియుండవచ్చు (భూమి కంపించినప్పుడు) కాని పరిశుద్ధులు ఆదివారం ఉదయంవరకు లేపబడినట్టులేదు (దాదాపు ప్రభువు లేపబడిన సమయానికే వారును లేపబడియుండ వచ్చు). అయినా, మత్తయి ఈ సంఘటనలను జతచేసినందున, మనం కూడ అలాగే చేద్దాం.

ఏమి జరిగిందో సమీపించి చూద్దాం. భూకంపం బండలను బద్దలు కొట్టినప్పుడు, గొల్గొతా ప్రాంతంలో ఉన్న కొన్ని రాతి సమాధులను అది బీటలు బారచేసి ఉండవచ్చు.[29] ఇలా తెరువబడిన సమాధులు కేవలం కోరి ఏరినవి మాత్రమే. అందులోనూ, “పరిశుద్ధులు” మాత్రమే లేపబడ్డారు. “పరిశుద్ధులు” పాతనిబంధన పరిశుద్ధులైయుండవచ్చు (కీర్తన. 34:9)[30] - తమ దేవునికి నమ్మకంగా నిలిచి, పాతనిబంధన కాలంలో ధర్మశాస్త్రం క్రింద జీవించినవారు మాత్రమే.

భూకంపం సమాధులను తెరచినప్పుడు, పరిశుద్ధుల శరీరాలు బయటపడేవే. అయినా, వారి మృత దేహాలను ముట్టడం ఆచార ప్రకారంగా అపవిత్రతగా భావించ బడుతుంది (సంఖ్యా. 19:11). ఆచారికంగా అపవిత్రత నొందినవారు సబ్బాతు దినాన ప్రత్యేకమైన భోజనం చేయ వల్లపడదు.[31] పైగా, ప్రజలు సబ్బాతు దినాన పనిచేయరు (నిర్గమ. 20:8-11). అందువలన, శుక్రవారం, శనివారం, ఆదివారంలో కొంత భాగం శవాలు బయటికి కన్పించే అవకాశముంటుంది.

క్రీస్తు పునరుత్థానము తరువాత ఏదో ఒక సమయంలో – దాదాపు అది జరిగిన వెంటనే దేవుడు ఆ పరిశుద్ధులను లేపాడు. "వారు సమాధులలోనుండి వెలుపలికివచ్చి పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు కనబడిరి" (మత్తయి 27:53). ఎవరు లేపబడ్డారో మనకు తెలియదు. అయితే యెరూషలేములో కాపురమున్నవారికి వారు తెలిసియుండవచ్చునని గుప్తమైయుంది.[32] వారు ఎవరికి కనబడ్డారో కూడ మనకు తెలియదు. అది వాస్తవమని సాక్ష్యమివ్వడానికి అప్పటికి యెరూషలేములో యింకను మనుష్యులు బ్రదికియున్నారని మత్తయి దాఖలుచేసిన సంభవాలు గుప్తం చేశాయి. వారి పునరుత్థానము యొక్క నిజమైన విధమెట్టిదో మనకు తెలియదు. పాతనిబంధనలోను, క్రీస్తు ప్రభువు పరిచర్యలోను లేపబడినవారివలె, వీరు కూడా భౌతిక మరణం మరల అనుభవించవలసియుంటుందని మనం ఊహించవచ్చు.[33]

మనకు తెలియని దానినంతటిని అలా ఉంచి, ఆ సందర్భం ఎంతటి ముఖ్యమైనదో యోచించు. ఈ సంఘటనను ఎంచకుండ – పాత కొత్త నిబంధనలో లేపబడినవారిని వేళ్లమీద లెక్కించవచ్చు.[34] – కాని యిక్కడ, ఒకప్పుడు, "అనేకమంది … పరిశుద్ధులు … లేపబడ్డారు!" ఎంత వింత!

**దీని భావమేమి**

ఈ జీవిత కాలంలో, ఈ సంభవాన్ని గూర్చి మనం తెలిసికోగోరేదంతా ఎన్నడు తెలిసికోలేం. అయినా, "క్రీస్తు పునరుత్థానం తరువాత" పరిశుద్ధులు లేపబడ్డారనే వాస్తవం ఆయన పునరుత్థానానికి వారి పునరుత్థానానికి సంబంధమున్నట్టు తెలుపుతోంది. ఆయన పునరుత్థానం వారి పునరుత్థానాన్ని సాధ్యం చేసింది – ఆయన పునరుత్థానం మన పునరుత్థానాన్ని సాధ్యం చేయబోతున్నట్టే. "ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమ ఫలముగా[35] క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు" (1 కొరింథీ. 15:20) గనుక, ఈ అద్భుతం దైవికమైన వాగ్దానాన్ని ప్రకటిస్తుంది: మనం దేవుని "పరిశుద్ధులమైతే" (నమ్మకమైన క్రైస్తవులుగా), మనం కూడా, "చివరి దినాన," మహిమలోనికి దేవుని శక్తిచేత లేపబడతాం (యోహాను 6:40)! పౌలు యిలా రాశాడు,

> … మన మందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పుపొందుదుము, బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనమందరము మార్పు పొందుదుము. క్షయమైన యీ శరీరము అక్షయతను ధరించుకొనవలసియున్నది; మర్త్యమైన యీ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు, మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, – విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును, … అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక (1 కొరింథీ. 15:51–57).

ఆహా, ఏలాటి వాగ్దానము!

## ముగింపు

నీవు సిలువవైపు తేరి చూస్తుండగా, నీ హృదయము తాకబడకుండ ఉండగలదా? ఆకాశము తాకబడకుండలేదు; అది చీకటి కమ్మింది. బండలు తాకబడకుండలేదు; అవి బ్రద్దలయ్యాయ్. తెర తాకబడకుండలేదు; అది పైనుండి క్రిందికి చినిగింది. పాతనిబంధన కాలంలోని పరిశుద్ధుల సమాధులలో కొన్ని తాకబడకుండ లేదు; అవి ప్రాణముతో బ్రదికింపబడ్డాయి. మనుష్యులు జరిగినదానిని చూచినప్పుడు, "ఈయన నిజముగా దేవుని కుమారుడని!" కేక వేసిరి (మత్తయి 27:54; మార్కు 15:39; లూకా 23:47, 48 చూడు). నీ సంగతి ఏమి? ఈ ప్రసంగముతో నీ హృదయం తాకబడి నట్టయితే, నేడే లోబడుము.[36]

## నోట్సు

ఈ ప్రసంగాన్ని పలు కోణాల్లోనుండి చూడవచ్చు, – ఈ పాయింట్సును కార్డుల మీద రాసి ప్రదర్శించవచ్చు: ("చీకటి," "భూకంపం," "తెర చినగడం" "మృతులు లేపబడడం"). ఇంకొకవైపు "P" కి అనుగుణంగా ఉండే "Portent" (అలౌకిక ఘటన), "Power" (శక్తి), "Purpose" (ప్రయోజనము) మరియు "Promise" (వాగ్దానము).

ప్రయోగాత్మక పాఠాలను కూడా చేయవచ్చు. చీకటికి నిలువుగా ఉన్న క్రాస్‌ను ఒక నల్ల బట్టతో కప్పవచ్చు. భూకంపానికి మధ్యలోకి రెండుగా "చీలిన" రాయిని ఉపయోగించు (దానిని సరైన సమయానికి రెండుగ చీలేటట్టు అతికించు) తెరకు ఒక రంగు బట్ట ముక్కను చింపు. మృతులు లేచినదానికి ఒక చిన్న బొమ్మను ఉపయోగించు. మృతులను చూపేటప్పుడు నీ స్పీకరు స్టాండు మీద ఆ బొమ్మని పరుండ బెట్టు. మృతులు లేచినట్టు చెప్పడానికి ఆ బొమ్మను కాళ్ళమీద నిలబెట్టు) కొంత సృజనాత్మకతనుపయోగించి, ఒక చాక్ బోర్డును తయారు చేయవచ్చు. ముఖ్యమైన పదాలు, లేఖనాలు, దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయవచ్చు.

---

సూచనలు

[1]William R. Nicholson, *The Six Miracles of Calvary* (Chicago: Moody Press, 1928) నుండి ఈ ఐడియా తీసికొనబడింది. [2]ఎవరెస్టు శిఖరం 29,035 అడుగుల ఎత్తు. [3]Nicholson, 17. [4]"భయానకము" ఏదో యొక విపత్తు సంభవిస్తుందనే సూచన. [5]చీకటిని వివరించే అలంకార పదమును ఉపయోగించు. [6]ఈలాటి చీకటి అనుభవం నీకు ఉంటే దానిని వివరించు. [7]Phlegon అనే ఒక రోమా చరిత్రకారుడు ఈ "చీకటి" రికార్డు చేసినట్టు ఓరిజన్, ఇసూబియస్ వారు తెలిపారు (R. C. Foster, *Studies in the Life of Christ* [Grand Rapids, Mich.: Baker Book House, 1971], 1282). ఈ సంఘటన Tertulliam Apology 21. 20లో సూచింపబడింది. [8]గ్రహణమైతే కొన్ని నిమిషాలు ఉంటుంది, ఈ చీకటి మూడు గంటలు కొనసాగింది. [9]ఈ సంచికలో వివరించిన "సమయం" పై వివరణను మరలా చెప్పు. [10]మొదటి మూడు గంటలలో జనసమూహము అవమానాల వర్షం కురిపించారు; చివరి మూడు గంటల కాలంలో వారు రొమ్ముకొట్టుకొంటున్నారు (లూకా 23:48).

[11]"క్రీస్తు సిలువపై ఎందుకు మరణించాలి?" అనే దానిలో చూడు. [12]"Terra firma" అనే లాటిన్ పదం, దానికి "స్థిరమైన భూమి" అని అర్థం. [13]The Richter scale భూకంపపు ప్రభావాన్ని కొలిచే కొలపరిమాణం. [14]భూకంపం పై

అలంకార వివరణను యివ్వు. [15]భూకంపమనేది దేవునిచే కలిగింపబడేది. [16]"సమాప్తమైనది" అనే దానిపై నోట్సు చూడు. [17]దేవాలయపు తెర చినిగిపోవడాన్ని గూర్చి లూకా రికార్డు మనకున్నట్టయితే (లూకా 23:44, 45), చీకటిగానున్న మూడు గంటల కాలంలో జరిగిందని మనం తలంచేవారమే. మత్తయి మార్కులను లూకాతో పోల్చినప్పుడు, ఆ "మూడు గంటల" అంతంలో జరిగినట్టు తెలుస్తుంది. [18]"క్రీస్తు జీవితం, 1"లో చూడు. [19]"క్రీస్తు జీవితం, 1"లో దేవాలయపు పటాన్ని చూడు. [20]1 రాజులు 6:20 మూర అంటే రమారమి అడుగున్నర–30 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పును ఉదహరించు.

[21]బబులోనీయులు సొలొమోను దేవాలయాన్ని నాశనం చేశారు. తరువాత అది జెరుబ్బాబెలు చేతను అటు తరువాత హేరోదు చేతను తిరిగి కట్టబడింది. [22]గుడారపు, పరిశుద్ధస్థలంలో ఏడు దీపములు గల సువర్ణ దీపస్తంభం ఉండేది (నిర్గమ. 25:31–35). సొలొమోను దేవాలయంలో పది దీపాల స్తంభాలున్నట్టుంది (1 రాజు. 7:49). [23]Nicholson, 41. [24]భూకంపము గొల్గొతాకే పరిమితం కానందున, (మత్తయి 27:51, 52), భూకంపమును దేవాలయపు తెరచినగడం జతచేయబడినందున (మత్తయి 27:51), దేవాలయపు ప్రాంతం దెబ్బతిన్నట్టు ఊహించబడింది. [25]తెర చినిగిన ఆశ్చర్యమైన విధానం యాజకులందరికి తెలియవచ్చియుండవచ్చు. యాజకులలో అనేకులు మార్పు పొందడానికి యిదొక హేతువైయుండవచ్చు (అపొ. 6:7). [26]తెర చినిగిపోవడం (లోను చెల్లింపబడిన తరువాత లోను పేపర్లు చింపివేయ బడినట్టు) మొదటి నిబంధనను "చింపివేయడమైయుంటుంది." [27]"రక్షణను గ్రహించుట" అనే రచనను చూడు. [28]మీ శ్రోతలకు అనుకూలమైన రూపంలో ఈ భావాన్ని వివరించు. [29]ఆ ప్రాంతంలో సమాధులున్నట్టు పురాతన వస్తు శాస్త్రవేత్తలు స్థిరపరిచారు. [30]"పరిశుద్ధులు" అంటే "ప్రత్యేకించబడినవారు." మనం దేవుని పిల్లలుగా మారినప్పుడు దేవుని సేవకొరకు మనం ప్రత్యేకించబడినవారమైయున్నాం.

[31]"క్రీస్తు జీవితం, 6"లో యోహాను 18:28పై నోట్సు చూడు. [32]వారు ఎవరో తెలుసుకోకపోతే, వారు యితర పట్టణంనుండి వచ్చినవారు కావచ్చు. [33]వారి పునరుత్థానం ప్రభువు పునరుత్థానం వంటిది కాదు. ఆయన మరెన్నడు మరణించకుండునట్టు లేపబడ్డారు. [34]పాతనిబంధనలోనుండి ముగ్గురు (1 రాజులు 17; 2 రాజులు 4; 13), క్రీస్తువారి పరిచర్యలో ముగ్గురు (మత్తయి 9, లూకా 7; యోహాను 11), అపొస్తలుల కాలంలో యిద్దరు (అపొ. 9, 20) ఉన్నట్టున్నారు. [35]"ప్రథమ ఫలం" (పంటలో) ప్రభువుకు సమర్పించబడేవి (నిర్గమ. 23:19). తొలి ఫలములుంటే పంట పండుతుందని అభయమియ్యబడుతుంది. [36]క్రైస్తవుడు ఎలా కావాలో నీ శ్రోతలకు వివరించవచ్చు (మార్కు 16:15, 16). త్రోవ తప్పిన క్రైస్తవులు తిరిగి వచ్చే సంగతిని కూడా తెలుపవచ్చు (అపొ. 8:22; యాకోబు 5:16).